ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24.08.2024 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షకావత్‌ను మన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు.

2. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) మాదాపూర్‌లో సినీ నటుడు నాగార్జునకు చెందిన N-కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేసింది.

3. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక పరమైన సవాళ్లు ఉన్నపటికీ కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో ఆలోచిస్తోందని, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

4. సింగరేణి బొగ్గుగనుల సంస్థలో మహిళా ఉద్యోగులను వేధించినట్లు తెలిస్తే అందుకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ సీఎండీ బలరాం నాయక్ ఆదేశించారు.

**JUPALLY**

రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షకావత్‌ను రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ఈ రోజు  జూపల్లి కృష్ణారావు సమావేశమయ్యారు. తెలంగాణలో పర్యాటక అభివృద్ధికి కావాల్సిన వనరులు ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిధులివ్వాలన్నారు. దీనిపై కేంద్రమంత్రి షెకావత్ సానుకూలంగా స్పందిస్తూ...తెలంగాణ పర్యాటక అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం మంత్రి జూపల్లి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల మార్గాలను అన్వే షిస్తున్నామని, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి.. కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని, దీనికోసం నిధులు కేటాయించాలని గజేం ద్ర సింగ్ షెకావత్‌ను కోరినట్లు వెల్లడించారు. కాగా, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్య కార్య దర్శి వాణి ప్రసాద్, పర్యాటక అభివృ ద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి మంత్రి వెంట ఉన్నారు.

DESK

**HYDRA**

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) మాదాపూర్‌లో సినీ నటుడు నాగార్జునకు చెందిన N-కన్వెన్షన్ సెంటర్‌ను కూల్చివేసింది. తెల్లవారుజామున, హైడ్రా ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు 4-5 భారీ

యంత్రాలతో ఈ భవనాన్ని కూల్చివేసేందుకు ప్రాంగణానికి చేరుకున్నాయి. N-కన్వెన్షన్ సెంటర్ పక్కనే ఉన్న చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణం జరుగుతుందని చెప్తూ... హైడ్రా కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చింది. భారీ బందోబస్తు మధ్య కూల్చివేత పనులు జరగగా, ఎన్ కన్వెన్షన్ కు వెళ్లే దారులను పోలీసులు మూసేశారు. కాగా, ఎన్ కన్వెన్షన్ కూల్చి వేతపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్తులు ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ఆస్తి అంటే.. ప్రజల ఆస్తి అని ఆయన పేర్కొన్నారు.

HYD –PTC

**PONNAM**

రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక పరమైన సవాళ్లు ఉన్నపటికీ కార్మికుల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో ఆలోచిస్తోందని, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈరోజు హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు మంత్రి ప్రగతిచక్రం పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వ బాండ్లతో 80 కోట్ల రూపాయిల చెల్లింపులు జరిగాయని, మరో 200 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నిధులు తీసుకొచ్చి, చెల్లించే బాధ్యత ప్రభుత్వానిదేని చెప్పారు. రాఖి పండగ రోజు మహిళలు ఉచిత ప్రయాణం ద్వారా 17 కోట్ల రూపాయిల విలువ చేసే ప్రయణాలు చేపట్టారని తెలిపారు. అదే రోజు ఆర్టీసీ సంస్థకు రికార్డు స్థాయిలో 14. 90 కోట్ల రూపాయిల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాబోయే 5 సంవత్సరాల కాలంలో ముందస్తు అవసరాలు దృష్టిలో పెట్టుకొని మరిన్ని కొత్త బస్సులు, రెండోసారి ఉద్యోగ నియామకాలు

చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసి ఎండీ సజ్జనార్,ఇతర ఆర్టీసి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన ఆర్టీసి డ్రైవర్ మెరుగు సంపత్ కుటుంబానికి కోటి రూపాయలు ప్రమాద భీమ చెక్కును మంత్రి అందజేశారు.

**SDP**

**CM REVANTH**

అంతర్జాతీయ, జాతీయ క్రీడలు నిర్వహించే అవకాశాన్ని తెలంగాణకు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, నిన్న కేంద్ర క్రీడలశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిశారు. ఈ సందర్భంగా క్రీడా శాఖపై రాష్ట్ర ప్రభుత్వానికి లక్ష్యాలను, ఆకాంక్షలను కేంద్ర మంత్రికి వివరించారు. ఒలింపిక్స్ తో పాటు పలు అంతర్జాతీయ క్రీడల్లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడానికి అన్ని వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్తూ.. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఆర్థిక సాయం అందించాలని కోరారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ఖేలో ఇండియా పథకం నిధుల విడుదలను కూడా పెంచాలని ముఖ్యమంత్రి విన్నవించారు. ముఖ్యమంత్రితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు ఉన్నారు.

**SDP**

**KTR**

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ఈ ఉదయం మహిళా కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు సభిత ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్ ఉన్నారు. కాగా .. తారక రామారావు ఇచ్చిన వివరణతో మహిళా కమిషన్ చైర్మన్ నేరేళ్ళ శారద సంతృప్తి చెందినట్లు బిఆర్ఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

DESK

**NIRMAL MP NAGESH**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిర్మల్ జిల్లాలో వందశాతం అమలు చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధిపై నిన్న సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావ్ రావ్ పాటిల్, జిల్లా అధికారులతో ఎంపీ నగేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

PTC, Nirmal

**SINGARENI**

సింగరేణి బొగ్గు గనుల సంస్థలో మహిళా ఉద్యోగులను వేదించినట్లు తెలిస్తే అందుకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ సీఎండీ బలరాం నాయక్, ఏరియా జీఎంలకు ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగులను

వేధించిన వారిపై ఫిర్యాదు చేయడానికి అన్ని ప్రాంతాల్లో ఈరోజే కమిటీలు, అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చెయ్యాలని సూచించారు. దీంతో మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ సింగరేణి కార్యాలయాల వద్ద అధికారులు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

PTC, MNCL

**RAMAGUNDAM**

గంజాయి, మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచాలని రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ అధికారులకు సూచించారు. రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై వెంటనే విచారణ చేయాలన్నారు.పోలీస్  స్టేషన్ కి వచ్చే బాధితులతో మాట్లాడాలని పోలీసులకు చెప్పారు.

PTC, Peddapally

**ANGANWAD-ASIFABAD**

అంగన్వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ తో కలిసి ఆయన సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, పిరామిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి అంగన్వాడీలో టి.హెచ్.ఆర్. హెచ్.సి.ఎం. వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్ లో నమోదు చేయాలని చెప్పారు.        PTC, ASIFABAD

**BRAOU ADMISSIONS 2024**

2024-25 విద్యా సంవత్సరానికి దూర విద్య ద్వారా డిగ్రీ, పీజీతో పలు డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సుల్లో చేరడానికి బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆన్ లైన్ దరఖాస్తుల గడువును పొడిగించింది. అభ్యర్థులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలు www.braouonline.in వెబ్ సైట్ లో చూడాలని సూచించింది. సందేహాలు ఉంటే సమీపంలోని అధ్యయన కేంద్రాలను సంప్రదించాలని చెప్పింది.

Desk

**KAVVAL**

కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ ఇంధన్ పల్లి  రేంజిలో... చేపట్టిన అభివృద్ధి పనులను సీసీఎఫ్ శాంతారాం, మంచిర్యాల జిల్లా ఫారెస్ట్ అధికారి శివ్ ఆశిష్ సింగ్ నిన్న సాయంత్రం క్షేత్రస్థాయిలో పర్యటించారు. అక్కడ పెంచుతున్న గడ్డి క్షేత్రాల వివరాలు అడిగి తెలుసుకున్న అధికారులు, గడ్డి క్షేత్రాల పెంపకంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని ఆదేశించారు.

PTC, MNCL

**WARANGAL**

విష జ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు.  నర్సంపేట మండలంలోని బానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ నిన్న తనిఖీ చేశారు. జ్వర సర్వే, మందుల రికార్డులను పరిశీలించి, విష జ్వరాల వివరాలను తెలుసుకున్నారు. ఈ

సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నాలుగు రోజులుగా జ్వరం ఉంటే, తప్పనిసరిగా పరీక్షలు చేయాలని అధికారులను సూచించారు. విష జ్వరం ప్రభావం తీవ్రంగా ఉంటే, ఎంజీఎం ఆస్పత్రికి సిఫారసు చేయాలని వైద్యులకు చెప్పారు.

PTC, WGL

**WEATHER UPDATE**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు, రేపు ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆదిలాబాద్, కొమరం బీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజమాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్లా, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వికరాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబుబ్ నగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని పేర్కొంది. రుతుపవనాల ప్రభావంతో గత కొన్ని రోజులు హైదరాబాద్ సహా పలు చోట్ల కొంత ప్రాంతానికే పరిమితమై కుండపోత వర్షాలు కురుస్తున్నాయి.

**PN**

**YOGA KRM**

యోగాసానాలను అందరూ తమ దినచర్యలో భాగంగా చేసుకుంటే, ఆరోగ్యంగా ఉండవచ్చని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమెల సత్పతి అన్నారు. కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యోగా ఆట పోటీలను కలెక్టర్

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రోజు ఉదయం 30 నిమిషాలు యోగ చేస్తే, రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చని పేర్కొన్నారు.

PTC, KRMNR

**REV. SINGARENI**

సింగరేణిలో మహిళా ఉద్యోగులను వేదిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ సీఎండీ బలరాం నాయక్, ఏరియా జనరల్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగులను వేధించిన వారిపై ఫిర్యాదు చేయడానికి అన్ని ప్రాంతాల్లో ఈ రోజే కమిటీలు,అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చెయ్యాలని సూచించారు. దీంతో మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ సింగరేణి కార్యాలయాల వద్ద అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. కాగా, కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలు రావడంతో, అతడిపై సస్పెండ్ చేస్తున్నట్టు సింగరేణి సంస్థ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

**PTC, MNCL**